
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3

జనగామ

బుధవారం 12 జూన్ 2024


# మోగిన బడిగంట





» నేటి నుంచి స్కూళ్ల పునఃప్రారంభం » ముగిసిన వేసవి సెలవులు

» పూర్తి కాని మరమ్మతు పనులు » మొదటి రోజే పుస్తకాల పంపిణీ

జనగామ కల్చరల్, జూన్ 11: వేసవి సెలవులు ముగించుకొని నేటి నుంచి పాఠశా లలు పునఃప్రారంభం కానున్నాయి. రుతుపవనాలు పూర్తి స్థాయిలో జిల్లాకు రానప్పటికీ వాతావరణం మా త్రం ఓ పూట ఎండ, ఓ పూట మబ్బులా ఉంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను సబ్జెక్టు టీచర్లు, స్కా వెంజర్లు, అటెండర్ల కొరత వేధిస్తూనే ఉంది. 'అమ్మ ఆదర్శ పాఠ శాల' పథకం కింద ప్రారంభమైన పనులు ఇంకా పూర్తి కాలేదు. ఓవైపు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుండగా మరో వైపు బడిగంట మోగింది.

**కొనసాగుతున్న బడిబాట...**

సర్కారు స్కూళ్ల బలోపేతమే లక్ష్యంగా ఈ నెల 6 నుంచి ప్రారం భమైన బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఉపాధ్యాయులు ఇం టింటికీ తిరుగుతూ బడిలో చేర్చాల్సిన పిల్లల జాబితాను తయారు చేశారు. మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. హాజరైన ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులతో పాఠశాలల బలోపేతం పై చర్చిం చారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించారు. సర్కారు బడుల్లో కూడా ఇంగ్లీషు మీడి యం బోధిస్తున్న విషయమై ప్రజలకు వివరించారు.

**యథావిధిగా ఆంగ్ల బోధన...**

గతంలో మాదిరిగా ఈ విద్యా సంవత్సరం నుంచి కూడా ఒక టి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో బోధన చేసేం దుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా డిజిటల్ బోధనపై కూడా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. దాదాపుగా అన్ని స్కూళ్లకు డిజిటల్ బోర్డులు వచ్చాయి. ఈసారి డిజిటల్ బోధన పూర్తి స్థాయిలో అమలయ్యే పరిస్థితులు ఉన్నాయి.

**నత్తనడకన 'అమ్మ ఆదర్శ పాఠశాల' పనులు...**

జిల్లాలో 'అమ్మ ఆదర్శ పాఠశాల' పథకం కింద 291 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. పనులు ప్రారంభించి

» మిగతా 6వ పేజీలో...

## విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

6లో



సమీక్షలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## వరంగల్ సీపీగా రంగనాథ్?



**నేడో రేపో ఉత్తర్వులు**

వరంగల్ క్రైం, జూన్ 11: వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఏ.వి.రంగనాథ్ వస్తున్నట్లు సమాచారం. వరంగల్ రేం జ్ ఇన్‌చార్జి ఐజీగా ఉన్న రంగనాథ్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ నేడో రేపో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. కాగా, అసెంబ్లీ ఎన్నికల సం దర్భంగా బదిలీల్లో భాగంగా వరంగల్ సీపీగా ఉన్న రంగనాథ్ స్థానచ లనం చెందారు. రంగనాథ్‌పై బీజేపీ నేతలు సైతం ఫిర్యాదు చేయడంతో తప్పని పరిస్థితిలో బదిలీ చేశారనే ప్రచారం ఉంది. రంగనాథ్ స్థానంలో అంబర్ కిషోర్ ఝాను నియమించడం జరి గింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన సందర్భంగా ప్రభుత్వం పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తుంది. ఇందులో భాగంగా రంగనాథ్ తిరిగి వరంగల్ పోలీస్ కమిషనర్‌గా వస్తున్నారనే ప్రచారం సాగుతోంది. పలువురు రాజకీయ నాయకులు, ఇతర వర్గాలు రంగ నాథ్ రాకను స్వాగతిస్తున్నట్లు సమాచారం.



## ఇసుక తరలింపుపై విచారణ

అనుమతులు రద్దుచేయాలని కోరిన రైతులు

చెక్‌డ్యాంను పరిశీలించిన అదనపు కలెక్టర్

కలెక్టర్‌కు నివేదిస్తానని వెల్లడి



వాగునుంచి చెక్‌డ్యాం వరకు నడిచి వెళ్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

వివరాలు 6వ పేజీలో..

ఫిస్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు - 6లో..








# విత్తన కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

## స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి

## సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జూన్ 11: రైతాంగానికి అవసరమయ్యే జీలుగ, పచ్చిరొట్ట తదితర విత్తనాల కుంభకోణంలో విజిలెన్స్ విచారణ చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడారు. 1660 బస్తాలు బోగస్ పేర్లతో ఇతర రాష్ట్రాలకు తొర్రూరు వ్యవసాయాధికారి అమ్ముకుంటే విచారణ చేపట్టిన అధికారి పూర్తి స్థాయిలో విచారణ చేయకుండా తప్పుడు నివేదిక అందించారన్నారు. సుమారు రూ.20లక్షల మేర కుంభకోణం జరిగినా ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి జోక్యం చేసుకుని సమగ్ర జ్యుడీషియల్ విచారణ జరిపించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి రాకుండా ఇతర అధికారులను పంపించి మొక్కుబడి విచారణ వల్లే జరిగిన అవినీతి అక్రమ కుంభకోణం బయటికి రావడం లేదన్నారు. క్షేత్ర స్థాయిలో ఆగ్రోస్ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతుంటే వ్యవసాయాధికారులు కన్నెత్తి చూడకపోవడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిందని, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వీరన్న, వెంకటేశ్వర్లు, పాపారావు, అనిల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

# బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11 : ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ హైని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులెవరూ నష్టపోకుండా పారదర్శకంగా సీనియారిటీ జాబితాలను రూపొందించి ఉపాధ్యాయుల అభ్యంతరాలను స్వీకరించాలని కోరారు. అభ్యంతరాలను సానుకూల దృక్పథంతో పరిష్కరించి పారదర్శక సీనియారిటీ జాబితాలను డీఈవో వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు పీఆర్టీయూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పలీత శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షుడు రొండ్ల భానుప్రసాద్, నాయకులు డి. మాలకొండారెడ్డి, జి. రాజు పాల్గొన్నారు.



డీఈవో అబ్దుల్ హైకి వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

## ఉద్యోగం ఇప్పిస్తానని రూ.20లక్షలకు టోకరా

**ఇద్దరిపై కేసు నమోదు**

గార్ల, జూన్ 11: మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని పీక్లీ తండాకు చెందిన బోడ సంజీల్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రూ.20 లక్షలు తీసుకున్నారని, దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. హైదరాబాద్‌కు చెందిన దాసరి రమ్య-వంశీ దంపతులు ఇంట్లో సంజీల్ అక్క భూక్యా ఉష ఏడాది కాలం నుంచి పని చేస్తోంది. ఈ క్రమంలో తమ తమ్ముడు సంజీల్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని రమ్య-వంశీలను ఉష ప్రాధేయపడింది. దీంతో కొంత డబ్బు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తాని చెప్పి దంపతులు నమ్మబలికారు. రూ.20 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2023 డిసెంబర్ నుంచి నేటి వరకు విడతల వారీగా ఫోన్‌పే, అకౌంట్ ద్వారా డబ్బులు చెల్లించారు. అయినప్పటికి ఉద్యోగం చూపించకపోవడంతోరమ్య-వంశీపై సంజీల్ గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.





వరంగల్ హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉత్తరాలను పోస్టుబాక్సులో వేస్తున్న పరికిపండ్ల అశోక్, తదితరులు

# సాధారణ బోగీల కోసం సమరం

- మానుకోట నుంచి కోటి ఉత్తరాల పోరుకు శ్రీకారం
- తెలుగు రాష్ట్రాల్లో ఊపందుకున్న నినాదం
- రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలనేదే అందరి డిమాండ్
- ప్రధానికి మోదీకి చేరడమే లక్ష్యంగా ప్రారంభించిన మహబూబాబాద్ వాసి

మహబూబాబాద్ టౌన్, జూన్ 11 : ప్రతీ రైలులో రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి.. అవి సాధారణ ప్రయాణికులకు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. రైలు ప్రవేశ ద్వారాల్లో వేలాడుతూ.. అవస్థలు పడుతూ ప్రయాణిస్తుంటారు. దేశంలో ప్రతీరోజు రైళ్లలో దాదాపు 30లక్షల మంది ప్రయాణిస్తున్నారని ఓ అంచనా. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని.. అప్పుడే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, దేశ వ్యాప్తంగా రైళ్లలో సాధారణ ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధాని మోదీ దృష్టికి తీసుకు పోవాలన్న లక్ష్యంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ మార్చి 8న ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితిని ఏర్పాటు చేసి శ్రీకారం చుట్టిన ఈ ఉద్యమం మూడునెలల కాలంలోనే తెలుగురాష్ట్రాలకు పాకింది. మూడునెలల్లో ఆయన తెలంగాణలో 29 జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉద్యమాన్ని విస్తృత పర్చారు. ఇక ఈ ఉద్యమం గురించి వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వివిధ రాష్ట్రాల ప్రజలు కూడా స్వచ్ఛందంగా మద్దతు పలుకుతూ వారు సైతం ప్రధానికి ఉత్తరాలు రాస్తున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌కు జీవనోపాధికోసం వెళ్లిన తెలుగు ప్రజలు కూడా కోటి ఉత్తరాల కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. ఇలా ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 8 లక్షల ఉత్తరాలను ప్రధానికి రాసినట్టు డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు.

### ఉద్యమానికి బీజం ఇలా..

మహబూబాబాద్ నుంచి వరంగల్ వెళ్లేందుకు 2024 మార్చి 8న మానుకోట పట్టణానికి చెందిన రైళ్లలో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ పరికిపండ్ల అశోక్ మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్నారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రాగా ఆ రైలుకు ముందు భాగంలో ఇంజన్ వెనుక ఒక జనరల్ బోగీ, వెనుక భాగంలో మరో జనరల్ బోగీ ఉంది. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ గర్భిణి చిన్నపాపతో కోణార్క్ రైలు ఎక్కేందుకు ప్రయత్నించి, కింద పడిపోయింది. చంకలో ఉన్న పాప తలకు దెబ్బతగిలింది. వెంటనే 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆరు రోజుల తర్వాత అభంశుభం తెలియని ఆ పాప చనిపోయింది. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ గర్భిణికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

కొద్ది రోజుల తర్వాత గర్భంలో ఉన్నపిండం కూడా చనిపోయిందని తెలిసింది. దీం తో చలించి పోయిన పరికిపండ్ల అశోక్ ఈ తప్పు ఎవరిదీ? శిక్ష ఎవరికి? అని ఆలోచించి, సాధారణ ప్రయాణికుల బాధలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్లి సరిష్కరించాలని కోటి ఉత్తరాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కడానికి సిద్ధంగా ఉన్న సాధారణ ప్రయాణికులు (ఫైల్)

### 20 ఏళ్ల నుంచి రెండు సాధారణ బోగీలే..

దేశ వ్యాప్తంగా రోజురోజుకు జనాభా వృద్ధి చెంది రైలు ప్రయాణికులు పెరుగుతున్నప్పటికి రైళ్లల్లో మాత్రం జనరల్ బోగీల సంఖ్య మారడం లేదు. దాదాపు రెండు దశాబ్దాల కిందట నుంచి ఇప్పటికి ప్రతీ రైలులో రెండు సాధారణ బోగీలు మాత్రమే ఉంటున్నాయి. నిత్యం వ్యాపార, ఉద్యోగ పనుల నిమిత్తం నిత్యం ప్రయాణించే వారి సం ఖ్య విపరీతంగా పెరుగుతూ వస్తోంది. రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉండడంతో సాధారణ ప్రయాణికులు రైలు ఎక్కాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఏవో ఇబ్బందులు పడి రైలు ఎక్కినప్పటికి గమ్యస్థానం చేరేంత వరకు నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రపంచంలో అతి పెద్ద రవాణావ్యవస్థగా ఉన్న భారత రైల్వేశాఖ ఈ సమస్యను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

### ఎల్లలు దాటిన కోటి ఉత్తరాల కార్యక్రమం..

ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాలని మానుకోట నుంచి అరం భమైన ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమం ఒక్క జిల్లానే కాదు..! ఒక్క రాష్ట్రం కాదు.. ఎల్లలు దాటి దేశవ్యాప్తమైంది. సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలంగాణ రాష్ట్రంలోని 29 జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 18 జిల్లాలు గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో, పాండిచ్చేరి సమీపంలోని యానంలో కూడా స్వయంగా కోటి ఉత్తరాల ఉద్యమంపై అవగాహన కల్పించారు. భారత దేశంలో 140 కోట్లకు చేరువైన జనాభాలో సుమారు ప్రతీరోజు 30 లక్షల మంది ప్రయాణికులు రైళ్ల ద్వారా ప్రయాణి స్తున్నారని, సాధారణ ప్రయాణీకుల బాధలను గుర్తించి అందరూ ప్రధానికి ఉత్తరం రాయాలని కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అన్నివర్గాల ప్రజల మద్దతు లభించడంతో ఇప్పటికే దాదాపుగా 8 లక్షల వరకు ప్రధానికి ఉత్తరాలను పంపి ఉండవచ్చని చెబుతున్నారు. ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేసి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలి

**డాక్టర్ పరికిపండ్ల అశోక్, రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్, మానుకోట**



ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలి. రైళ్లలో జనరల్ బోగీలు ఎక్కువగా లేకపోవడంతో నిత్యం ప్రయాణించే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా రైలుఎక్కే సమయంలో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో, కొందరు ఎక్కలేక పోతున్నారు. మరి కొంతమంది రైలు ఎక్కే సమయంలో జారి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేసి ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలి.



**ఛ్చ.. చిప్స్ లేవే..!**

చెట్టుపైనున్న ఓ ఉడత.. ఎవరో తినిపడేసిన చిప్స్‌ప్యాకెట్‌ను చూసింది. అందులో ఏమైనా తినడానికి దొరుకుతాయేమోనని ఆశపడింది. ఎంతో ఆత్రుతగా.. ఆశగా చెట్టుపై నుంచి దిగి వచ్చింది. ఆ ఖాళీ ప్యాకెట్‌ను అటు.. ఇటు.. కిందికి.. పైకి తిప్పి చూసింది. కానీ అందులో ఏమీ దొరక్కపోవడంతో.. చివరకు ప్యాకెట్‌కు అంటుకుని ఉన్న కాస్తంత చిప్స్ పొడిని ఆస్వాదించి వెళ్లిపోయింది. ఈ దృశ్యాలు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో మంగళవారం కనిపించాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

## ముఖ్యమంత్రిని కలిసిన టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 11 : తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్‌గా నియమి తులైన మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డిని కలిసిన తరువాత ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు తదితర కాంగ్రెస్ ముఖ్య నేతల ను కలిశారు. ఛైర్మన్‌గా నియమితులైన రవీందర్‌రావుకు అభినందనలు తెలియచేశారు. టెస్కాబ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌రావు సాయంత్రం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్‌కు చేరుకున్నారు. బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ ఉద్యోగులు, సీఈవోలు తదితరులు ఆయనకు భారీ పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో మార్నేనిని సన్మానించారు. టెస్కాబ్ ఛైర్మన్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా రవీందర్‌రావు పేర్కొన్నారు.

## నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి

- అధిక లోడ్, అంతరాయాల నివారణకు ప్రత్యేక చర్యలు
- త్వరలో 35 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- 'ఆంధ్రజ్యోతి'తో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి



హనుమకొండ సిటీ, జూన్ 11 : ఎన్పీడీసీఎల్ పరిధిలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరంతరం విద్యుత్‌ను అందించేందుకు శక్తి వంచనలేకుండా కృషిచేస్తున్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలో తీసుకోబోతున్న చర్యల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. మానవ ప్రమేయం లేకుండా సాంకేతికను జోడించి అంతరాయాలకు సంబంధించిన సమస్యలను కార్పొరేట్ ఆఫీస్ నుంచి గుర్తించి సత్వర చర్యలు చేపట్టేలా ఆర్‌టీడీఏస్, ఎస్‌ఏడిఏను ప్రతీ సబ్‌సబ్‌స్టేషన్‌లో అమర్చబోతున్నామన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు 800కిలోమీటర్ల మేర లైన్ ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించామని, మరో 300కిల్లోమీటర్లకు త్వరలోనే టెండర్లకు ఆహ్వానిస్తామన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న లెంతీలైన్‌ల మధ్య అంతరాయాలు తగ్గించేందుకు ప్రతీ 5 కిలోమీటర్లకు ఒక పాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్స్ (ఎఫ్‌పీఐ) ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయాలకు, ప్రమాదాలకు కారణమవుతున్న లూజ్ లైన్‌లను చాలా వరకు సవరించడం జరిగిందని, ఇంకా అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న లూజ్ వైర్లను సవరించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అధికలోడును తగ్గించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలో త్వరలోనే 35 సబ్‌స్టేషన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఎన్పీడీసీఎల్ పరిధిలో 2156 సింగిల్ ఫెజ్ లైన్‌లను త్రీ ఫెజ్ లైన్‌లుగా మార్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఇప్పటి వరకు 1995 లైన్‌లను త్రీ ఫెజ్ లైన్‌లుగా మార్చడం జరిగిందన్నారు. కాగా, ఉమ్మడి వరంగల్‌లో 402 సింగిల్ ఫెజ్ లైన్‌లను త్రీ ఫెజ్‌లైన్‌గా మార్చడం జరిగిందన్నారు. మిగితా వాటిని మార్చేందుకు వేగంగా పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

## మార్కెట్‌లో వ్యాపారుల ఆందోళన

- డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటున్న ఆగ్రహం
- నిబంధనల మేరకే నడుచుకున్నామన్న అధికారులు

వరంగల్ వ్యవసాయం, జూన్ 11: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులు ఆందోళనకు దిగారు. పర్మిట్ బుక్కులు ఇవ్వకుండా, ఏదో ఒకసాకుతో డబ్బులు గుంజేలా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ అధికారులతో చాంబర్ ప్రతినిధులు వాగ్వాదానికి దిగారు. మంగళవారం ఉదయం కరానీ ఖరీదుదారుడికి సంబంధించిన గుమస్తా మార్కెట్ కార్యాలయంలోని సూపర్‌వైజర్ మురళీ వద్దకు వెళ్లి పర్మిట్ బుక్కులను ఇవ్వాలని కోరాడు. సూపర్‌వైజర్ 2024 కొత్త నార్మ్స్ ప్రకారం ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ 1 నుంచి 10 ప్రొఫార్మా కావాలని, అది ఇస్తే పర్మిట్ బుక్కులు ఇస్తానని చెప్పడంతో సదరు గుమస్తా అక్కడ జరిగిన విషయాన్ని యజమానికి వివరించాడు. కరానీ యజమానితోపాటు చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు మార్కెట్ కార్యాలయానికి చేరుకుని సూపర్‌వైజర్‌తో పాటు గ్రేడ్ 2 కార్యదర్శి రాముతో వాగ్వాదానికి దిగారు. పర్మిట్ బుక్కులు ఎందుకు ఇవ్వరని, వ్యాపారుల నుంచి డబ్బులు గుంజాలని చూస్తున్నారంటూ గొడవకు దిగారు. కొత్తగా వచ్చిన నిబంధనల మేరకే ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ షీట్ అడిగామని, డబ్బులు అడగలేదని గ్రేడ్ 2 కార్యదర్శి చెప్పే ప్రయత్నం చేసినా వారు పట్టించుకోలేదు. చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు మినీ చాంబర్ కార్యాలయంలో సమావేశమయ్యారు.



మార్కెట్ కార్యాలయంలో ఆందోళన నిర్వహిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులు

### జమ్మికుట మార్కెట్‌కు వెళ్లిన మార్కెట్ కార్యదర్శి

ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి గుగులోతు రెడ్డి మంగళవారం జమ్మికుంట మార్కెట్ వెళ్లారు. మార్కెట్లో గొడవ జరిగిన సమయంలో మార్కెట్లో లేరు. దీంతో చిన్న విషయం కాస్తా పెద్దగా తయారైంది. జమ్మికుంట మార్కెట్ కార్యదర్శిగా ఉన్న నేపథ్యంలో అక్కడ కూడా కార్యకలాపాలు ఎలా నడుస్తున్నాయో చూసేందుకు వెళ్లారు. ఏనుమాముల మార్కెట్లో కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో అధికారులు మార్కెట్లో జరిగిన విషయాన్ని మార్కెట్ కార్యదర్శికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన మార్కెట్ కార్యదర్శి ఏనుమాముల మార్కెట్‌కు చేరుకున్నారు.

మార్కెట్లో చాంబర్ ప్రతినిదులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఏనుమా ముల మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి, మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు ఏనుమాముల మార్కెట్‌కు చేరుకుని అధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.

### చాంబర్ ప్రతినిధులతో అధికారుల సమావేశం

మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మల్లేశం, డీడీ అజ్మీరా జు, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు బొమ్మినేని రవిందర్‌రెడ్డి, మడూరి వేదప్రకాష్, అల్లె సంపత్, అలాగే కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, కరాని రాజు తదితర వ్యాపారులతో సమావేశమయ్యారు. సమస్య సద్దుమనిగేందుకు అధికారులు కృషి చేశారు. 2024 నిబంధనల మేరకు ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ ఫాం 1 టు10 ప్రొఫార్మా ప్రతీ నెల 10వ తేదీలోపు ఇవ్వాల్సి ఉండగా దానిని 20వ తారీకు వరకు ఇచ్చేందుకు చాంబర్ ప్రతినిధులు గడువు కోరారు. పర్మిట్ బుక్కులు ఇవ్వాలంటే తప్పకుండా ప్రతీనెల పీఆర్ ఇవ్వాలని, మార్కెట్ ఫీజు 10 తారీకు లోపు చెల్లించాలని అధికారులు షరతు పెట్టారు. దానికి చాంబర్ ప్రతినిధులు కూడా ఒప్పుకోవడంతో సమస్య సద్దుమనిగింది.

## 'విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 11 : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి నాడే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాలకు చేరిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలలను పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఎస్సెస్సీ ఫలితాల్లో కూడా ఉత్తమ మార్కులు సాధించిన విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ప్రారంభానికి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, స్థానిక శాసనసభ్యులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. డీఈవో వెంట సెక్టోరియల్ అధికారి సుధాకర్, హెచ్ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు రంజాన్ అలీ, వీరస్వామి ఉన్నారు.

# అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి

**డీడబ్ల్యూవో జయంతి ● టీచర్లకు మెమో జారీ, సాలరీ నిలిపివేత**



మల్కాపేట అంగన్‌వాడి సెంటర్‌లో కోడిగుడ్లను పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో జయంతి

నర్మెట, జూన్ 11 : అంగన్‌వాడి టీచర్లు విధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని డీడబ్ల్యూవో జయంతి అన్నారు. మంగళవారం ఆమె మల్కాపేట గ్రామంలోని అంగన్‌వాడి సెంటర్‌ను పరిశీలించారు. ఇటీవల ఇక్కడ కోడిగుడ్లు, స్నాక్స్ తీసుకున్న చిన్నారి ఆద్యశ్రీకి ఫుడ్ పాయిజన్ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెంటర్ 2లోని కోడిగుడ్లను, స్నాక్స్‌ను పరిశీలించారు. గడువు దాటిన(కాలం చెల్లిన) గుడ్లు, స్నాక్స్ నిల్వ ఉంచడంతో టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటర్‌లో నిర్వహిస్తున్న రిజిస్టర్‌లను పరిశీలించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కోడిగుడ్లు మంచిగానే ఉన్నా స్నాక్స్ గడువు దాటినవి ఉన్నాయని మండిపడ్డారు. అంగన్‌వాడి సెంటర్ 1 టీచర్ సక్రమంగా రావడంలేదని, రిజిస్టర్ నిర్వహించడం లేదని తెలుసుకున్నారు. దీంతో ఇద్దరు అంగన్‌వాడి టీచర్లు నీరజ, సరస్వతిలకు మెమో జారీ చేసి, ఒక నెల సాలరీ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజలు, సుమతి, సునిత, జనగాం అర్బన్ సూపర్‌వైజర్ పూర్ణిమ అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 49 మంది ఎంపిక

జనగామ కల్చరల్, జూన్ 11: ఎస్ బ్యాంకు ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో 49 మంది ఎంపికైనట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్.ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ బ్యాంకులో సీనియర్ ఆఫీసర్ ఉద్యోగాలకు జిల్లా కేంద్రం లోని ఏకశిల ఐటీఐలో నిర్వహించిన జాబ్‌మేళాకు 105 మంది అభ్యర్థులు హాజరు కాగా మొదటి రౌండ్ ఇంటర్వ్యూలో 49 మంది ఎంపికయ్యారని, రెండో రౌండ్ ఈ నెల 14న హైద్రాబాద్‌లో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ బ్యాంకు తరఫున బి.కుమార్, ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

## ఫిస్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు



జాతీయస్థాయిలో ఆడి గెలిచిన తెలంగాణ ఫిస్ట్‌బాల్ జట్టు

పాలకుర్తి, జూన్ 11: ఈ నెల 7 నుంచి 10 వరకు పంజాబ్ రాష్ట్రం లుధియానాలో జరిగిన 15వ జాతీయ స్థాయి అండర్ 18 విభాగంలో ఫిస్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో వరంగల్ క్రీడాకారులు సత్తా చాటారని ఉమ్మడి వరంగల్ జిల్లా ఫిస్ట్‌బాల్ కార్యదర్శి బాలబోయిన సందీప్ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ బాలుర విభాగంలో మొత్తం 16 టీంలు పాల్గొనగా ఫైనల్స్‌లో తెలంగాణ, పంజాబ్ జట్లు తలపడ్డాయని పంజాబ్‌పై 11-09, 11-08 స్కోర్‌తో తెలంగాణ జట్టు గెలిచిందని అన్నారను. బాలికల విభాగంలో 14 టీంలు పాల్గొనగా ఫైనల్స్‌లో తెలంగాణ, చండీగడ్ జట్లు తలపడగా, చండీగడ్ జట్టు విజయం సాధించిందని, తెలంగాణ జట్టు రన్నర్‌గా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు దుర్గాప్రసాద్, మహిత్, శ్రీకాస్, సుహర్ష్, సాయి చరణ్‌లను ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంపన్న ప్రతాప్, ప్రధాన కార్యదర్శి కొమ్ము వెంకట్ అభినందించారని తెలిపారు.

# ఇసుక తరలింపుపై విచారణ

**● రైతులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్**

దేవరుప్పుల, జూన్ 11: మండలంలోని రంభోజీగూడెం వాగు నుంచి పాలకుర్తి మండలం చెన్నూరు రిజర్వాయర్‌కు ఇసుకను తరలిస్తుండగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు అడ్డుకొని కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విచారణ నిమిత్తం మంగళవారం అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ రంభోజీగూడెం వచ్చారు. అక్కడి నుంచి చెక్ డ్యాం వరకు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లారు. అక్కడి పరిస్థితి గురించి రైతులతో మాట్లాడారు. చెక్‌డ్యాంలో ఇసుకను పరిశీలించారు. ఇసుక మేటలు లేకున్నా ఉన్నట్లుగా చూపించి ఇసుక తరలింపునకు అనుమతులు ఎందుకు ఇచ్చారని మైనింగ్, ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. వారు ఇచ్చిన అనుమతి పత్రాలను పరిశీలించారు. కాగా, ఇసుక తరలిస్తే బోర్లు వట్టిపోయి తాము రోడ్డున పడతామని రైతులు మొరపెట్టుకున్నారు. చెక్‌డ్యాం కంటే ఇసుక కిందికే ఉందని, మేటలు వేయలేదని చెప్పడంతో ఆయన స్వయంగా పరిశీలించారు. ఇక్కడి వాస్తవ పరిస్థితిని కలెక్టర్‌కు నివేదిస్తానని అన్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ విజయ్, ఇరిగేషన్ ఈఈ ప్రవీణ్, డీఈ శ్రీకాంత్, డీఏవో వినయ్‌కుమార్, ఏఈలు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



వాగువద్ద అనుమతి కాపీలను పరిశీలిస్తున్న రోహిత్‌సింగ్

**కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల వాగ్వాదం**

అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ విచారణ కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఘర్షణకు పాల్పడ్డారు. బీఆర్ఎస్ పాలనలోనే వాగునుంచి ఇసుక తోడుకెళ్లారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించగా బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. ఇసుక తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి ఇరువర్గాలను వారించే ప్రయత్నం చేసినప్పటికీ ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరలేదు. మరోవైపు మైనింగ్ ఏడీ విజయ్‌పై రైతులు విరుచుకుపడ్డారు. చెక్ డ్యాం వద్ద ఇసుక మేటలు వేస్తే తాము ఎత్తి పక్కన పోసుకుంటామని స్పష్టం చేశారు. అంతేగాని ఇసుక తోడితే బోర్లు ఎండిపోయి తాము తీవ్రంగా నష్టపోతామని మండిపడ్డారు. అధికారులు అమ్యామ్యాలకు ఆశపడి అనుమతులు ఇచ్చారని ఆరోపించారు.

# నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించాలి



అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

**కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**

జనగామ కల్చరల్, జూన్ 11: నులిపురుగుల నిర్మూలనపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. ఈ నెల 20న మొదటి దశ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించనున్న దృష్ట్యా కలెక్టరేట్‌లో మంగళవారం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆరు నెలలకోసారి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో 1 నుంచి 19 ఏళ్ల వయసు గల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. పరిశుభ్రమైన తాగునీరు, గ్లాసులు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈవో కె.రాము, డీఐఈవో అంజనేయరాజు, డీడబ్ల్యూవో జయంతి, డీఏవో డాక్టర్ మహేందర్, డిప్యుటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్, ప్రోగ్రాం అధికారులు ప్రభాకర్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శాంతియుత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి..**

శాంతియుత వాతావరణంలో బక్రీద్ పర్వదినాన్ని జరుపుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీసీపీ సీతారామ్, ఏసీపీ అంకిత్‌కుమార్ శంఖ్వార్‌తో కలిసి కలెక్టర్ ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం జంతు వధ నిషేధమన్నారు. దీనికి సంబంధించి పోలీస్, రోడ్, ట్రాన్స్‌పోర్టు, మార్కెటింగ్, వెటర్నరీ అధికారులు తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డాక్టర్ మనోహర్, వై.నర్సయ్య, జిల్లాలోని పశు వైద్యులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## సీపీవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



జనగామ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీవో)గా లావుడ్య శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. నల్లగొండ ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పిస్తూ జనగామ సీపీవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా.. జనగామ సీపీవోగా పనిచేసిన సయ్యద్ ఇస్మాయిల్ మార్చి 31న పదవీ విరమణ చేశారు. దీంతో సీపీవో కార్యాలయంలో గణాంక అధికారి(ఎస్‌వో)గా పనిచేస్తున్న జితేందర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. జితేందర్‌రెడ్డి నుంచి శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు.

## ఇన్‌చార్జ్ డీసీహెచ్‌గా చంద్రమౌళి



జనగామ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రుల ఇన్‌చార్జి కోఆర్డినేటర్(డీసీహెచ్)గా డాక్టర్ చంద్రమౌళి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కోఆర్డినేటర్‌గా ఉన్న డాక్టర్ సుగుణాకర్‌రాజు అమెరికాకు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో చంద్రమౌళిని ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

**మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి..**

## గుండెపోటుతో యువకుడి మృతి



వినయ్ (ఫైల్)

జనగామ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మొక్కు తీర్చుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడకు వెళ్లిన యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. జిల్లాకేంద్రంలోని ధర్మకంచకు చెందిన బొట్ల వినయ్(23) తన అన్న కొడుకు, కూతురు పుట్టు వెంట్రుకలు తీయించేందుకు సోమవారం వేములవాడకు వెళ్లారు. రాత్రి రాజన్న దర్శనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం వినయ్‌కు ఛాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించేలోపే చనిపోయాడు. మృతుడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



రవికుమార్ (ఫైల్)

రఘునాథపల్లి, జూన్ 11: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మంచిర్యాల జిల్లా నత్యూర్ మండల కేంద్రం అంబేద్కర్ కాలనీకి చెందిన సుర రవికుమార్ (31) అనే యువకుడు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు. కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రఘునాథపల్లి-యశ్వంతపూర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి చనిపోయాడని పోలీసులు తెలిపారు. సంఘటన స్థలంలో లభించిన ద్విచక్ర వాహనం నెంబరు ఆధారంగా వివరాలు తెలుసుకొని కుటుం బసభ్యులకు సమాచారం ఇచ్చారు. జీఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమణా రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

లింగాలఘణపురం, జూన్11: లింగాలఘణపురం మోడల్ స్కూల్‌లో హిందీ ఉపాధ్యాయ పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ పూర్తి చేసి హిందీపండిట్ శిక్షణ పొందిన అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకోసం 9676959203 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీంకు విద్యార్థుల ఎంపిక

జనగామ కల్చరల్, జూన్ 11: బెస్ట్ అవైలబుల్ స్కీం కింద మంగళవారం విద్యార్థులను ఎంపిక చేశారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సమక్షంలో డ్రా తీసి 1వ తరగతికి 34 మంది, 5వ తరగతికి 25 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.దయానందరాణి తెలిపారు. కార్యక్రమంలో డీఈవో కె.రాము, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జిల్లా కోఆర్డినేటర్ ఎ.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## 'దాడి చేసిన వారిని శిక్షించాలి'

చిలుపూర్, జూన్ 11 : తనతో పాటు, తన భర్తపై అకారణంగా దాడి చేసిన వారిని శిక్షించాలని శ్రీపతిపల్లికి చెందిన చెట్టబోయిన అనూష-జంపరాజు దంపతులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఇక్కడ మాట్లాడుతూ సర్వేనంబర్ 160, 161లలో తమకు 2.28 ఎకరాల భూమి ఉందని, అందులో గతంలోనే పైప్‌లైన్ వేశామని, అయితే పక్కనే ఉన్న మరో రైతు భూమిలో నుంచి పైప్‌లైన్ వేసినందున మూడు రోజుల క్రితం సదరు రైతు వచ్చి పైప్‌లైన్ తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ.. తమపై దాడి చేశారని అన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని, ఉన్నతాధికారులు విచారణ జరిపించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, విచారణ చేపట్టి బాధ్యులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై ముత్యం రాజేందర్ అన్నారు.

## రేణుక ఆలయంలో 'నూటొక్క' మొక్కులు



నూటొక్క కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్న టీడీపీ నేత ఎస్‌కే రాజు

రఘునాథపల్లి, జూన్ 11: ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించిన సందర్భంగా రఘునాథపల్లిలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకుడు ఎస్‌కే రాజు మంగళవారం నూట ఒక్క కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో నారా చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ 7 అక్టోబరు 2023న ఎస్‌కే రాజు రాజమండ్రి వరకు సైకిల్ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బొక్క రాంచంద్రయ్య, ఎడ్ల మల్లేష్, ఉమ్మగోని నర్సయ్య, ఎండి.జహంగీర్, దశరథ, గండికోట యాదగిరి, మాల మల్లేషం, మరాఠి వీరస్వామి, కొంగరి నర్సింగ రావు పాల్గొన్నారు.

# మోగిన బడిగంట

(3వ పేజీ తరువాయి)

నెలరోజులు కావస్తున్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. 90 శాతం పాఠశాలల్లో పనులుపూర్తయ్యాయని, ఇంజనీర్లు అడిషనల్‌గా ఎస్టిమేట్ చేయడంతో ఆ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. 'మన ఊరు మన బడి' పథకం కింద చేపట్టిన పనులు కొన్ని నిధుల లేమితో ఆగిపోగా వాటికి సైతం నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధమైందని వారు పేర్కొన్నారు.

**చేరుకున్న పాఠ్య పుస్తకాలు ...**

జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 2,29,630 పాఠ్య పుస్తకాలు అవసరమని గుర్తించగా ఇప్పటి వరకు 2,03,300 పాఠ్య పుస్తకాలు వచ్చాయని అధికారులు తెలిపారు. వాటితో పాటు 2,02,653 నోటు పుస్తకాలు కూడా వచ్చాయని, అన్నింటినీ పాఠశాలలకు సరఫరా చేశామని తెలిపారు. అంతేగాకుండా మొదటి జత యూనిఫాంలు కూడా పాఠశాలలకు పంపించామని, రెండో జత లను మరో 20 రోజుల్లోగా అందిస్తామని తెలిపారు. పాఠశాల పునఃప్రారంభం రోజున నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పాలకుర్తి హైస్కూల్‌లో, జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ ఉన్నత పాఠశాలలో, స్టేషన్‌ఘన్‌పూర్ జంట పట్టణం శివునిపల్లి హైస్కూల్‌లో పంపిణీ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**పెరుగుతున్న ప్రైవేటు ఫీజులుం ...**

మరోవైపు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులుం కొనసాగుతోంది. ఐఐటీ పేరుతో ప్రైవేటు పాఠశాలలు ఫీజులను పెంచేస్తున్నాయి. పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్‌బుక్‌లు, స్టేషనరీ తదితర వాటికి పెరిగిన రేట్లతో ప్రైవేటు విద్యాసంస్థల్లో చేర్పించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**జిల్లాలో 465 ఖాళీలు ...**

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉంది. జిల్లా వ్యాప్తంగా 2560 సాంక్షన్ పోస్టులు ఉండగా 2095 స్థానాల్లో మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. ఇంకా 465 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రమోషన్ల విషయంలో వివాదం నెలకొనగా కోర్టు తీర్పులో చిక్కుముడి వీడింది. దీంతో భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రమోషన్ల కోసం సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. కాగా, జిల్లాలో 341 ప్రాథమిక పాఠశాలలు, 64 యూపీఎస్‌లు, 103 హైస్కూల్లు, 12 కేజీబీవీలు, 8 మోడల్ స్కూళ్లు, 10 ఎయిడెడ్ పాఠశాలలు, 19 రెసిడెన్షియల్ స్కూళ్లతో మొత్తం 557 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 30 వేల మంది విద్యార్థులు ఉన్నారు.

**విద్యారంగ ఆకాంక్షలు సాకారం కావాలి..**

**ఎ.శ్రీనివాసరావు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి**



పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న తరుణంలో విద్యారంగ ఆకాంక్షలు సాకారం కావాలి. స్కావెంజర్ల వ్యవస్థను ప్రభుత్వం తొలగించింది. అటెండర్లు పూర్తిస్థాయిలో లేరు. ప్రమోషన్లు, బదిలీల అనంతరం సబ్జెక్టు టీచర్ల కొరత ఉంటే విద్యావలంటీర్లను నియమించాలి. స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించడం సంతోషకరం. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల నమ్మకాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. స్కూల్ మేనేజ్‌మెంట్ గ్రాంటు ముందుగానే విడుదల చేయాలి.

**ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాల పంపిణీ..**

**కె.రాము, డీఈవో, జనగామ**



పాఠశాలల పునఃప్రారంభ రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తాం. ఆయా నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వాములను చేస్తాం. పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభిస్తాం. పాఠశాలల్లో కొంత మేరకు సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం.

# విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు

**స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

జనగామ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తే తాను సహించబోనని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. జనగామ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టిన, చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నుంచి అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని, తన పేరు చెప్పి ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వవద్దని అధికారులకు తేల్చి చెప్పారు. నిజాయితీగా పనిచేసే అధికారులను తాను గౌరవిస్తానని అన్నారు. పని చేయడం ఇష్టం లేని వారు బదిలీ చేయించుకొని వెళ్లిపోవచ్చని అన్నారు. అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అధికారులు పనుల విషయంలో అలసత్వం వహించవద్దని, పరస్పర సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీడీపీ, ఎస్‌డీఎఫ్, అమ్మ ఆదర్శ పాఠశాల, ఈజీఎస్, ఎన్‌హెచ్‌ఎం కింద మంజూరైన నిధులకు సంబంధించిన చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులలో భాగంగా పాఠశాలల్లో మెరుగైన వసతులను కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు నిధులు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. రోడ్ల నిర్మాణంలో పర్యవేక్షణ లేకపోవడం వల్ల కొంతకాలానికే దెబ్బతింటున్నాయని, నిర్మాణ సమయంలో అధికారులు కచ్చితంగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు చిలుపూర్, వేలేరులో సమీకృత కార్యాలయాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో బంజార భవన్ నిర్మాణాలకు నిధులు ఉన్నందున వెంటనే స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఈ రఘువీరారెడ్డి, ఐటీడీఏ ఈఈ వీరభద్రం, పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్, వివిధ విభాగాల డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## తెలంగాణలో టీడీపీకి పునర్వైభవం

**నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీశ్**



చంద్రబాబును కలిసిన రామిని హరీష్

జనగామ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రానున్న రోజుల్లో తెలంగాణలో టీడీపీకి పునర్వైభవం ఖాయమని ఆ పార్టీ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీడీపీ కేడర్ ఇప్పటికీ బలంగానే ఉందని, కొద్ది రోజుల్లోనే పార్టీ తిరిగి బలోపేతం అవుతుందని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ తరఫున పోటీ చేసి మెజారిటీ స్థానాల్లో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం జరగనున్న చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారానికి జనగామ నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.